క్లుప్తంగా

సన్మానం

మహాముత్తారం: ఇటీవల నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన ఎస్సై మహేందర్‌కుమార్‌ను పోలీస్‌స్టేషన్‌లో శనివారం మండల బీఆర్‌ఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ శాంతకుమార్, నాయకులు రాదారపు స్వామి, వెంకటయ్య, నవీన్‌కుమార్, రూపా నాయక్, కల్వచర్ల రాజుతో పాటు తదితరులు ఉన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ గురుకుల బాలికల డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరంలో చేరేందుకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఉమాదేవి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2024–25 విద్యాసంవత్సరంలో గురుకుల సెట్ కామన్ ఎంట్రన్స్ పరీక్ష కోసం ఏప్రిల్ 12వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 28వ తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు. ఈ అవకాశం గిరిజన బాలికలకు మాత్రమే ఉంటుందని వినియోగించుకోవాలని పేర్కొన్నారు.

మండల కమిటీ ఎన్నిక



కన్నాయిగూడెం: మండల కేంద్రంలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఎన్నిక నిర్వహించారు. మండల నాయకుడు వానంపెల్లి సతీష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు మడివల్లి శ్యాంబాబు, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కరుణాకర్ హాజరై కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా వాసంపల్లి రాజేష్, అధికార ప్రతినిధిగా పరికి ప్రవీణ్‌ను ఎన్నుకున్నారు. అలాగే మహాజన సోషలిస్టు పార్టీ మండల అధ్యక్షుడిగా మహేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన వారికి నాయకులు నియమక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధికార ప్రతినిధి గజ్జల ప్రసాద్, వావిలాల సాంబశివరావు, ఎంపెల్లి శంకర్, బొచ్చు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



ఏటూరునాగారం: మండలంలోని వస్పాపురం గ్రామానికి చెందిన బీజేపీ కార్యకర్త బొల్లె లక్ష్మయ్య తండ్రి సమ్మయ్య ఇటీవల మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని ఆ పార్టీ నాయకులు శనివారం పరామర్శించి 25కిలోల బియ్యం, వంట సామగ్రిని అందజేశారు. కార్యకర్తలు, ప్రజలకు బీజేపీ అండగా ఉంటుందని మండల అధ్యక్షుడు గాడిచర్ల రాజశేఖర్ తెలిపారు. గండెపల్లి సత్యం, వావిలాల జనార్ధన్, గద్దల ప్రణయ్, వినుకోలు చక్రవర్తి, శివ, మనోహర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రేషన్ డీలర్లపై చర్య తీసుకోవాలి



శాయంపేట : ప్రభుత్వం రేషన్ షాపుల ద్వారా అందజేస్తున్న ఉచిత బియ్యం సరఫరాలో సంబంధిత డీలర్లు తూకంతో మాయాజాలం చేస్తూ కార్డుదారులను మోసం చేస్తున్న డీలర్లపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి మంద సురేష్, ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాగుల పవన్‌కళ్యాణ్ తహసీల్దార్ సుభాషిణికి శనివారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేషన్‌డీలర్లు అవకతవకలకు పాల్పడుతూ బియ్యం సరఫరాలో ప్రజలను మోసం చేస్తున్నారని తెలిపారు. రెవెన్యూ అధికారులు అవినీతికి పాల్పడిన డీలర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో రాజశేఖర్, మనోజ్ పాల్గొన్నారు.

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం

దామెర: నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకమని ఇన్‌చార్జ్ ఎస్‌హెచ్ఓ, ట్రెయినీ ఐపీఎస్ శుభం నగ్రాలే అన్నారు. మండలంలోని పసరగొండలో ఏర్పాటు చేసిన 6 సీసీ కెమెరాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక సీసీ కెమెరా వందకళ్లతో సమానమని అన్నారు. ప్రతి ఇంటిలో, ప్రతి వాడలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు దాతలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ట్రెయినీ ఐపీఎస్ అంకిత్‌కుమార్ శంఖ్వార్, పరకాల ఏసీపీ కిశోర్ కుమార్, సీఐ రంజిత్ రావు, ఎస్సై కొంక అశోక్ ఉన్నారు.

పోలీసుల ముమ్మర తనిఖీ



బ్రాహ్మణపల్లి వద్ద కారును తనిఖీ చేస్తున్న ఎస్సై రవికుమార్



కమలాపురం వద్ద తనిఖీలు చేస్తున్న పోలీసులు

మంగపేట: సీపీఐ (ఎంఎల్)మావోయిస్టు పార్టీ రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంతో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలో పోలీసులు అప్రమత్తమై ముమ్మరంగా తనిఖీ చేశారు. మండలంలోని అటవీ సమీప గ్రామాలు, అటవీ ప్రాంతాల్లో నివాసముంటున్న గొత్తికోయ గూడాలపై పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. లోక్‌సభ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో జిల్లా సరిహద్దులోని బ్రాహ్మణపల్లి అటవీశాఖ చెక్‌పోస్టు వద్ద పోలీసులు ప్రత్యేక చెక్ పోస్టును ఏర్పాటు చేశారు. ఎస్సై రవికుమార్ ఆధ్వర్యంలో సీఆర్‌పీఎఫ్, సివిల్ పోలీసులు 24 గంటలు విధులు నిర్వహిస్తు చెక్ పోస్టు మీదుగా వచ్చిపోయే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. అనుమానితుల నుంచి వారి వివరాలు సేకరించి వదిలేస్తున్నారు. మావోయిస్టులకు సంబంధించిన సమాచారాన్ని పోలీసులకు తెలుపాలన్నారు. మావోయిస్టులతో ఎలాంటి సంబంధం పెట్టుకోవద్దని సూచిస్తున్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

మహదేవపూర్: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని సీడీపీఓ రాధిక అన్నారు. పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా శనివారం మండల కేంద్రంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో నిర్వహించిన పోషణ్ పక్వాడా ముగింపు సమవేశంలో చిరుధాన్యలతో తయారుచేసిన ఆహార పదార్థాలు పోషకాహార పదార్థాలను ప్రదర్శించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ.. చిరుధాన్యాలతో తయారు చేసే వంటకాలు తినడం అలవాటు చేసుకోవాలన్నారు. స్థానికంగా లభించే తాజా కూరగాయలు ఆకుకూరాల్లో సైతం అనేక పోషకాలు ఉంటాయని వివరించారు. ఎంపీడీఓ ప్రసాద్, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.



అక్షరాభ్యాసం చేయిస్తున్న సీడీపీఓ రాధిక

ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలి

కొత్తగూడ: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్ అన్నారు. మండలకేంద్రంలో శనివారం పోలీస్ కవాతును ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎన్నికల కోడ్ ఉన్నందున నిబంధనలు ఉల్లంగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. డీఎస్పీ తిరుపతిరావు, సీఐలు బాబూరావు, రవికుమార్, ఎస్సై దిలీప్, పోలీసులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత

ఏటూరునాగారం: కారులో మద్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ రామకృష్ణ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం మండల కేంద్రంలోని చెక్ పోస్టు వద్ద లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎక్సైజ్ సిబ్బంది వాహనాలను తనిఖీ చేస్తుండగా కారులో మద్యం బాటిళ్లు కనిపించాయని తెలిపారు. సిబ్బంది కారును అదుపులోకి తీసుకొని ఎక్సైజ్ కార్యాలయానికి తరలించి తనిఖీ చేయగా 20 బీరు కాటన్లు, 3 కాటన్ల క్వార్టర్ల మద్యం లభించిందన్నారు. కారులో మద్యాన్ని కొండాయి, మల్యాల వైపు తరలిస్తున్న కొండా మహేందర్, ముక్కెర రవళిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశామన్నారు. స్వాధీనం చేసుకున్న మద్యం విలువ రూ.68వేల 700లు ఉంటుందన్నారు. ఎవరైనా అక్రమంగా మద్యం, గుడుంబా, గంజాయి రవాణా చేసినా, విక్రయించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. ఈ తనిఖీల్లో హెడ్ కానిస్టేబుల్ సందీప్, కానిస్టేబుల్ తిరుపతి, నవీన్, నాగరాజు, వీరన్న, శ్రీనివాస్, ప్రణవ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.



అరెస్టు చూపిస్తున్న ఎక్సైజ్ సీఐ రామకృష్ణ

అజ్ఞాత వ్యక్తులకు సహకరించొద్దు



మాట్లాడుతున్న సీఐ నాగార్జునరావు

మహాముత్తారం: అటవీ గ్రామాల ప్రజలు అజ్ఞాత వ్యక్తులకు సహకరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కాటారం సీఐ నాగార్జునరావు అన్నారు. మండలంలోని కనుకునూర్, సింగంపల్లి, రెడ్డిపల్లి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను శనివారం పరిశీలించారు. అనంతరం రెడ్డిపల్లిలో గ్రామస్తులతో మాట్లాడారు. గ్రామాల్లోకి ఎవరైనా అజ్ఞాత వ్యక్తులు వస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఎస్సై మహేందర్ కుమార్, సీఆర్‌పీఎఫ్, సివిల్ పోలీసులు ఉన్నారు.

ఉపాధిహామీ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాస్

పలిమెల: దమ్మూరు పంచాయతీ పరిధిలో నిర్వహిస్తున్న ఉపాధిహామీ పనులను శనివారం ఎంపీడీఓ శ్రీనివాస్, ఏపీఓ సునీతతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీతో మాట్లాడుతూ.. మండలంలోని కూలీలు వారి వందరోజులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

వెంకటాపురం(కె): రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలైన సంఘటన మండల పరిధిలోని పాత్రాపుర గ్రామ సమీపంలోని బ్రిడ్జి వద్ద శనివారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. చర్ల వైపు నుంచి వెంకటాపురం మండలానికి వస్తున్న కారు, వెంకటాపురం నుంచి చర్ల వైపునకు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టడంతో ద్విచక్రవాహనంపై ఉన్న ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం ఊసూరు గ్రామానికి చెందిన కట్టం నారాయణ, గట్టుపల్లి నాగులు, గట్టుపల్లి అర్జున్ ముగ్గురు వలస కూలీలకు తీవ్ర గాయాలైయ్యాయని తెలిపారు. గాయాలపాలైన వ్యక్తులను 108లో వెంకటాపురం వైద్యశాలకు తరలించినట్లు తెలిపారు.



చికిత్స నిర్వహిస్తున్న వైద్యులు

అవగాహనే 'ఎర్త్ అవర్' లక్ష్యం

నర్సంపేట : పర్యావరణ సమస్యలు, ప్రమాదాలు, విద్యుత్ ఆదా ప్రాముఖ్యత, తదితరాలపై ప్రజలందరికీ అవగావాన కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఏటా ఎర్త్ అవర్ కార్యక్రమం నిర్వహిస్తోందని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లం నవీన్ తెలిపారు. పట్టణంలోని ఆ కళాశాలలో వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. ఎర్త్ అవర్ సందర్భంగా సుమారు గంటపాటు ప్రజలు విద్యుత్ పరికరాలు ఉపయోగించకూడదని తెలిపారు. వృక్షశాస్త్ర విభాగాధిపతి ఎం.నరేందర్ మాట్లాడుతూ 2007 మార్చ్ 31న తొలిసారిగా సిడ్నీలో ఎర్త్ అవర్ పాటించారని చెప్పారు. పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత సమాజంలోని అందరిపైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ ఎ.శ్రీనాథ్, అధ్యాపకులు టి.రమేష్, ఎల్.సత్యనారాయణ ఉన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ నవీన్

గ్రామస్థాయిలో బీజేపీని బలోపేతం చేయండి

నర్సంపేట రూరల్ : గ్రామస్థాయి నుంచి బీజేపీని బలోపేతం చేయాలని ఆ పార్టీ నర్సంపేట నియోజకవర్గ చేరికల కమిటీ కన్వీనర్ రాణాప్రతాప్‌రెడ్డి శ్రేణులకు సూచించారు. మండలంలోని ఇటుకాలపల్లిలో మాజీ వార్డు సభ్యుడు తాళ్లపల్లి రాము ఆధ్వర్యంలో గర్వందుల రవి, బర్ల సాయిలు, సోనబోయిన చేరాలు, ప్రేమ్‌కుమార్, తదితరులు ఆ పార్టీలో శనివారం చేరగా వారికి రాణాప్రతాప్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ బడుగు, బలహీనవర్గాలకు సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరిస్తూ గ్రామాల్లో మరింత బలోపేతం చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు అన్ని గ్రామాలకు చేరాయని చెప్పారు. మహబూబాబాద్ పార్లమెంట్ స్థానానికి పోటీ చేస్తున్న ప్రొఫెసర్ సీతారాంనాయక్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గంగిడి మహేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు కేశబోయిన నరేశ్, మండల ప్రధాన కార్యదర్శి తడుక వినయ్ ఉన్నారు.

అమరవీరుల త్యాగాలు మరువలేనివి

ఏటూరునాగారం: అమరవీరుల త్యాగాలు మరువలేనివని, నేటి యువత వారిని స్ఫూర్తిగా తీసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చిన్న అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చరిత్ర విభాగం ద్వారా షాహిద్ దివస్ అమరవీరుల దినోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విప్లవ వీరులు భగత్ సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురు చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె చిన్న మాట్లాడుతూ.. భారత దేశ స్వాతంత్రం కోసం ఎంతోమంది మహాయోధులు వారి జీవితాన్ని త్యాగం చేశారన్నారు. చరిత్ర విభాగం అధిపతి సీహెచ్ వెంకటయ్య మాట్లాడుతూ.. ఎందరో మహనీయులు స్వాతంత్య్ర పోరులో విప్లవాత్మకమైన మార్గాన్ని ఎంచుకొని ఎదురొడ్డి పోరాడరన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు రవీందర్, స్వామి, విజయలక్ష్మి, రమేష్, నవీన్, ఫాతిమా, జ్యోతి, సంపత్, సురేష్, మున్ని, సంగీత పాల్గొన్నారు.

భగత్‌సింగ్ ఆశయ సాధనకు పాటుపడాలి

భూపాలపల్లి అర్బన్: యువకులు భగత్‌సింగ్ ఆశయ సాధనకు పాటుపడాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి నేరెళ్ల జోసెఫ్ అన్నారు. ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శనివారం భగత్‌సింగ్ వర్ధంతిని పట్టణంలోని రావినారాయణరెడ్డి భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం నేరెళ్ల జోసెఫ్ మాట్లాడుతూ... దేశ స్వాతంత్రం కోసం ప్రాణాలు వదిలిన భగత్‌సింగ్‌కు కేంద్ర ప్రభుత్వం భారత రత్న అవార్డు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. జయంతి, వర్ధంతిని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు వెంకటేష్, శ్యామ్, క్రాంతి, రాజ్‌కుమార్, లావణ్య, చందన, శ్రావణి పాల్గొన్నారు.



ఏటూరునాగారం: సమరయోధుల చిత్రపటాలకు పూలమాల వేస్తున్న ప్రిన్సిపాల్ చిన్న



చిట్యాల: చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రాజ్ మహ్మద్, విద్యార్థులు



భూపాలపల్లి అర్బన్: భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు

ఎస్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో..

ఎస్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భగత్‌సింగ్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్ సింగ్ చిత్రపటానికి ఎస్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు బట్టు కర్ణాకర్ పూల వేసి నివాళులర్పించారు. భగత్‌సింగ్ ఆశయాలతో యువకులు ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సురేష్, అఖిల్, తిలక్, చారి, అజయ్, రాజు, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల: మండల కేంద్రంలోని కాకతీయ హైస్కూల్‌లో షహీద్ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాకతీయ హైస్కూల్ కరస్పాండెంట్ ఎండీ.రాజ్ మహ్మద్ ఆధ్వర్యంలో విద్యార్థులు దేశ స్వాతంత్ర్య సమరయోధులు భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురు చిత్ర పటాలకు నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ముగ్గురు దేశ భక్తులు అనాటి బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బ్రిటిష్ సెంట్రల్ హాల్లో బాంబు వేసి దేశానికి స్వాతంత్ర్యం ఇవ్వాలని, అలాగే దేశం నుంచి వెళ్లి పోవాలని తిరుగుబాటు చేసినందుకు 1931 మార్చి 23న ముగ్గురికి ఉరిశిక్ష ఖరారు చేసి ఉరి తీశారన్నారు. ఆ వీర జవానుల మరణానికి గుర్తుగా భారత ప్రభుత్వం దేశ వ్యాప్తంగా షహీద్ దివస్‌గా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చెరువు కాల్వల మరమ్మతు



భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని గోరంటాల (కుంట) చెరువు కాల్వను అధికారులు మరమ్మతులు చేయిస్తున్నారు. వర్షాలు అధికంగా కురిసిన చెరువుకట్టకు ఏలాంటి ఇబ్బంది లేకుండా ఉండేందుకు చెరువుకు సంబంధించిన కాల్వల్లో మట్టిని తొలగిస్తున్నారు. అదేవిధంగా చెరువుకు సంబంధించిన భూమిలో కబ్జాదారులు దాటడానికి వేసిన సిమెంట్ పైపులను శనివారం అధికారులు జేసీబీలతో తొలగించారు.

ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం



టేకుమట్ల: అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రామకృష్ణాపూర్ (వీ) గ్రామంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు నలివెల నాగరాజు, చె క్క వెంకటేష్‌లపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఎవరైనా అక్రమంగా ఇసుక రవాణా చేస్తే పీ డీ యాక్ట్ కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ముందస్తు హోలీ వేడుకలు



హోలీ వేడుకల్లో విద్యార్థులు

రేగొండ: మండల కేంద్రంలోని వాణీ విద్యానికేతన్ పాఠశాలలో ముందస్తు హోలీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ ఆనందంగా హోలీ సంబురాలను జరుపుకున్నారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నర్వ రజిన్ కుమార్ హోలీ పండుగ విశిష్టతను విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శోభన్‌గౌడ్, రాజు,రమేష్, రవిందర్, దేవేందర్, ఐలయ్య, సుమన్, భిక్షపతి, మాలత, చైతన్య, అలీదా, రాధిక, శిరోమణి, ఉజ్వల, విద్యార్థులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డుపై ప్రమాదకర గుంత



రోడ్డుపై ఏర్పడిన గుంత

మల్హర్: మండలంలోని చిన్నతూండ్ల గ్రామంలోని ఎస్టీ కాలనీలో సీసీ రోడ్డుపై సీసీ రోడ్డు గుంత ప్రమాదరకంగా మారింది. గుంతతో ఇనుప చువ్వలు బయటకి వచ్చాయి. ఈ గుంత కారణంగా కాల నీ వాసులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే స్కూల్ వ్యాన్, ట్రాక్టర్స్, ఎడ్లబండ్లు వెళ్ల లేని పరిస్థి నెలకొందని కాలనీ వాసులు వాపోతున్నారు. కొత్తగా అటుగా వచ్చే ప్రయాణికులకు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని గ్రామస్తులు చెపుతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టి గుంతను పూడ్చాలని కోరుతున్నారు.

పరీక్ష కేంద్రాల తనిఖీ

కాటారం: మండల కేంద్రంలోని పదవ తరగతి పరీక్షా కేంద్రాలను శనివారం సీఐ నాగార్జునరావు తనిఖీ చేశారు. జెడ్పీహెచ్ పాఠశాల, గిరిజన గురుకుల బాలుర కళాశాల, ఆదర్శ హై స్కూల్ పరీక్ష కేంద్రాల్లో పరీక్ష కొనసాగుతున్న తీరు, సౌకర్యాలపై ఆరా తీశారు. బందోబస్తు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ అమల్లో ఉన్నందున ఇతరులను అనుమతించకూడదని సూచించారు. సీఐ వెంట ఎస్సై అభినవ్, సిబ్బంది ఉన్నారు.



పరీక్ష కేంద్రాల పరిసరాలను పరిశీలిస్తున్న సీఐ